ఆధారాలు లేని ఆరోపణలు

అలవాటైపోయింది

మీ కేసులన్నీ మూస పద్ధతిలో • ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తీరును సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా ఎండగట్టింది. ఆ సంస్థ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నదని, ఇదంతా ఓ మూస పద్ధతిలో జరుగుతున్నదని మండిపడింది. రుజువులు లేకుండా ఆరోపణలు చేయడం ఓ నమూనాను అనుసరిస్తున్నట్లుగా మారిందని దుయ్యబట్టింది. ఛత్తీస్‌గఢ్‌లో మద్యం కుంభకోణం కేసులో నిందితుని బెయిలు పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ ఏఎస్ ఓకా మాట్లాడుతూ, ''మేం చాలా ఈడీ కేసులను పరిశీలించాం. ఇదొక మూస పద్ధతిగా, అసలుకు నకిలీని తయారు చేసినట్లుగా మారింది. సాక్ష్యాధారాలు లేకుండానే ఈడీ ఆరోపణలు చేస్తున్నది'' అన్నారు. నిందితుడు నేరం చేసి రూ.40 కోట్లు సంపాదించినట్లు ఈడీ ఆరోపించిందని, ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో ఈడీ చెప్పలేకపోతున్నదని ఎద్దేవా చేశారు. ఏదైనా కంపెనీకి, నిందితునికి మధ్య ఉన్న సంబంధం ఏమిటో కూడా చెప్పలేకపోతున్నదని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు గత వారం కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. ''ద ర్యాప్తు తనదైన వేగంతో జరుగుతూ ఉంటుంది. అది శాశ్వతంగా కొనసాగుతూనే ఉంటుంది. మూడు ఛార్జిషీట్లను దాఖలు చేశారు. ఆ వ్యక్తిని కస్టడీలో ఉంచుతూ మీరు వాస్తవంగా శిక్షిస్తున్నారు. ఈ ప్రక్రియను మీరు శిక్షగా మార్చేశారు. ఇదేదో ఉగ్రవాది లేదా ట్రిపుల్ మర్డర్ కేసు కాదు'' అని ఆగ్రహం వ్యక్తం చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో 2019-2022 మధ్య కాలంలో ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.2,000 కోట్లు అవినీతి జరిగిందని ఈడీ ఆరోపించింది. ఆదాయపు పన్ను శాఖ నమోదు చేసిన కేసు నేపథ్యంలో ఈ మనీలాండరింగ్ కేసును ఈడీ నమోదు చేసింది. ఫిక్స్‌డ్ మార్కెట్ షేర్‌ను ఇచ్చినందుకు డిస్టిలరీల నుంచి లంచాలు తీసుకున్నారని ఆరోపించింది.

అసెంబ్లీలో ప్రశ్నల ఉపసంహరణకు

రూ.20 లక్షల లంచం

- **మొదట రూ.10 కోట్లు డిమాండ్ చేసిన ఎమ్మెల్యే!**
- **రాజస్థాన్‌లో రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేసిన ఏసీబీ**

జైపూర్: రాజస్థాన్‌లో అసెంబ్లీలో ప్రశ్నల ఉప సంహరణకు రూ.20 లక్షలు లంచం తీసుకున్న ఎమ్మెల్యేను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆదివారం అరెస్ట్ చేసింది. ఏసీబీ డైరెక్టర్ జనరల్ రవి ప్రకాశ్ మెహర్డ తెలిపిన వివరాల ప్రకారం... భారత్ ఆదివాసీ పార్టీ (బీఏపీ) కి చెందిన జైకృష్ణ బగిడోర ఓ ఎస్టీ నియోజకవర్గం ఎమ్మెల్యే. ఆయన వేరొక నియోజకవర్గంలోని గనుల గురించి మూడు ప్రశ్నలు శాసన సభకు సమర్పించారు. వాటిని ఉపసంహరించుకునేందుకు ఫిర్యాదుదారు నుంచి రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. చివరికి రూ.2.5 కోట్లకు ఒప్పందం కుదిరింది. వెరిఫికేషన్ సమయంలో ఫిర్యాదుదారు ఆ ఎమ్మెల్యేకు రూ.1 లక్ష ఇచ్చారు. రూ.20 లక్షలు ఇవ్వాలని ఫిర్యాదుదారును ఎమ్మెల్యే కోరి ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రమ్మని చెప్పారు. ఫిర్యాదుదారు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయనను కలిసి, నగదు ఉన్న బ్యాగ్‌ను ఇచ్చారు. ఆ సంచీని ఆయన మరొక వ్యక్తికి ఇచ్చారు. ఏసీబీ బృందం ఎమ్మెల్యేను ఈ సందర్భంగా ఘటనా స్థలిలో పట్టుకుంది. ఆ సంచిని తీసుకున్న వ్యక్తి నగదుతోపాటు అక్కడి నుంచి పారిపోయాడు. రాష్ట్రంలో అవినీతి కేసులో ఎమ్మెల్యేను అరెస్ట్ చేయడం ఇదే మొదటిసారి.

అడ కత్తెరలో పాక్!

దౌత్య మార్గంలోనూ భారత్ దాడి

- **ఉగ్రవాదంపై పోరులో ఇండియాకు సహకరించడానికి రష్యా, జపాన్ ఓకే**
- **ఉక్కిరి బిక్కిరవుతున్న దాయాది దేశం**

న్యూఢిల్లీ, ఇస్లామాబాద్, మే 5: పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇప్పటికే పలు ఆంక్షల ద్వారా పాకిస్థాన్‌ను అష్ట దిగ్బంధం చేసిన భారత్ ఇప్పుడు దౌత్య మార్గాలపై కూడా దృష్టి సారించింది. పాకిస్థాన్‌ను దోషిగా నిలబెట్టేందుకు అంతర్జాతీయ సమాజం సహకారాన్ని కూడా పొందుతున్నది. దీంతో పాకిస్థాన్ పరిస్థితి అడ కత్తెరలో పోక చెక్కలా మారింది. పాక్‌పై పోరు విషయంలో ఇప్పటికే భారత్‌కు రష్యా, జపాన్ దేశాలు మద్దతు పలికి భారత్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చాయి. భారత్‌కు యుద్ధ నౌకలు పంపుతామని జపాన్ హామీ ఇచ్చింది. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి మంగళవారం భారత్‌లో పర్యటించనున్నారు. అలాగే పాకిస్థాన్ ఉగ్రవాద చర్యలను భద్రతా మండలిలో ఎండగట్టేందుకు భారత్ సిద్ధమైంది.

రాజ్‌నాథ్‌తో సమావేశమైన జపాన్ రక్షణ మంత్రి నకతాని



పుతిన్

మోదీకి పుతిన్ ఫోన్

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోయిన నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ సాగిస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతును ప్రకటించిన పుతిన్ పహల్గాం ఉగ్రవాదులను శిక్షించాల్సిందేనని స్పష్టం చేసినట్లు కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. తమ రెండు దేశాల మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకోవాలన్న తమ సంకల్పాన్ని ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించినట్లు ఆయన చెప్పారు.

భారత్‌కు జపాన్ పూర్తి మద్దతు

ఉగ్ర చర్యలపై పోరాడుతున్న భారత్‌కు జపాన్ సంఘీభావం తెలిపింది. ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని జపాన్ మంత్రి జనరల్ నకతానితో ప్రకటించారు. 'కారణమేదైనా ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లో సమర్థనీయం కాదు. మేము అన్ని రకాల ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఆయన అన్నారు. అంతేకాకుండా భారత్‌తో కలిసి ఉగ్రవాదంపై పోరాటం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఆయన ప్రకటించారు. భారత్‌ను సందర్శించిన జపాన్ మంత్రి జనరల్ నకతానితో మన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం భేటీ అయ్యి కృతజ్ఞతలు తెలిపారు. 'పహల్గాం దాడి క్రమంలో భారత్‌కు జపాన్ గట్టి సంఘీభావాన్ని వ్యక్తం చేసినందుకు వారికి నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. భారత్-జపాన్ రక్షణ సంబంధాలను మరింత పటిష్ఠం చేయడానికి మీరు చేస్తున్న కృషికి అభినందిస్తున్నా' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.

సంయమనం పాటించండి: ఇరాన్

భారత్-పాకిస్థాన్ రెండు దేశాలూ సంయమనం పాటించాలని ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరఖ్చి కోరారు. ఒక రోజు పర్యటన నిమిత్తం ఆయన సోమవారం పాకిస్థాన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పరిస్థితుల్లో ఉద్రిక్తతలు తగ్గాలని తాము కోరుకుంటున్నామని, ఇరు పక్షాలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నామని అబ్బాసీ పేర్కొన్నారు.అరఖ్చి పాకిస్థాన్ నుంచి మంగళవారం న్యూఢిల్లీకి చేరుకుంటారని భారత్‌లోని ఇరాన్ ఎంబసీ ఎక్స్‌లో తెలిపింది.

సమావేశం కానున్న భద్రతా మండలి

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్, పాక్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న క్రమంలో ఐరాస భద్రతా మండలి సమావేశం కానుంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఇస్తున్న మద్దతు, ఆ దేశం పాత్రను ఈ అంతర్జాతీయ వేదికలో భారత్ ప్రధానంగా ప్రస్తావించ నుంది. కాగా, పహల్గాం దాడిని ఖండిస్తూ ఇప్పటికే ఐరాస భద్రతా మండలి ప్రకటన విడుదల చేసింది.

యుద్ధాన్ని భరించ లేదు: మూడీస్

ప్రస్తుతం భారత్‌తో యద్ధం చేసేందుకు పాక్ ఖజానాలో తగినన్ని నిధులు లేవని ప్రపంచ రేటింగ్స్ సంస్థ మూడీస్‌కి చెందిన విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. భారత్‌తో ఉద్రిక్తతలు పెరిగిన కొద్దీ పాకిస్థాన్‌కు విదేశీ ఆర్థిక సాయం దెబ్బ తినడమే గాకుండా , విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరగడం ఖాయమని వారు హెచ్చరించారు. విదేశీ రుణ చెల్లింపులకు సంబంధించి మరి కొన్ని నెలలకు సరిపడా విదేశీ మారక నిల్వలు మాత్రమే ప్రస్తుతం పాక్ వద్ద లభ్యతలో ఉన్నాయని నివేదికలో మూడీస్ పేర్కొంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతి ఏడాదిగడువు తీరిపోయే రుణాలకు చెల్లింపునకు అవసరమైన నిధులు పాకిస్థాన్ దగ్గర ఇప్పటికే లేవని స్పష్టం చేసింది. భారత్‌తో యుద్ధం చేయాల్సిన పరిస్థితే ఏర్పడితే పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం కావడం ఖాయమని హెచ్చరించింది.

భయపడుతున్న పాక్

అసలే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, భారత్ విధిస్తున్న తీవ్ర ఆంక్షలతో అన్నివిధాల కుదేలవుతున్న పాకిస్థాన్.. ఒక వేళ భారత్ యుద్ధానికి దిగితే పరిస్థితులు పూర్తిగా దిగజారిపోతాయని భయపడుతున్నది. పైకి మేకపోతు గాంభీర్యంతో అణు బెదిరింపులు చేస్తున్న ఆ దేశం యుద్ధ భారాన్ని తట్టుకునే పరిస్థితి ఏ మాత్రం లేదు. దీంతో ఎలాగైనా యుద్ధాన్ని ఆపాలని పాకిస్థాన్ ప్రయత్నాలు చేస్తున్నది. అందులో భాగంగా ఇప్పటికే పలు దేశాల వారిని సంప్రదించింది. ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ రష్యాకు చెందిన మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో టెలిఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. ఉద్రిక్తతలపై లావ్రోవ్ ఆందోళన వ్యక్తం చేయడమే కాక, ఈ సమస్యల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలని కోరారు. భారత్ దూకుడు చర్యల కారణంగా ఇరు దేశాల శాంతి, భద్రతలకు తీవ్ర విఘాతం ఏర్పడే పరిస్థితి ఉందని, ఈ విషయంలో జోక్యం చేసుకుని భద్రతా మండలిని సమావేశపర్చాలని ఐరాసకు పాకిస్థాన్ విజ్ఞప్తి చేసింది.

పాక్‌కు చీనాబ్ నదీ జలాలు బంద్

బాగ్లిహార్, సలాల్ డ్యామ్‌ల గేట్లు మూసివేత

న్యూఢిల్లీ, మే 5: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై చేపట్టిన చర్యలలో భాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసిన భారత్ తాజాగా చీనాబ్ నది నుంచి పాక్‌కు వెళ్లే జలాలకు అడ్డుకట్ట వేసింది. పాకిస్థాన్‌లోకి ప్రవహించే చీనాబ్ నదీ జలాలను నియంత్రించే బాగ్లిహార్, సలాల్ డ్యాంల గేట్లను భారత ప్రభుత్వం మూసివేసింది. జమ్మూ కశ్మీరులోని రియాసీ జిల్లాలో ఉన్న సలాల్ డ్యామ్ గేట్లన్నీ మూసివేయడంతో దిగువ ప్రాంతాలలో నీటి ప్రవాహ స్థాయి పడిపోవడంతోపాటు చాలా చోట్ల నది ఎండిపోయినట్లు తెలుస్తోంది. బాగ్లిహార్ డ్యామ్ గేట్లను మూసివేయడంతోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. మరో ప్రధాన నది జీలం ప్రవాహాన్ని అడ్డుకునేందుకు నిర్మించిన కిషన్‌గంగా డ్యాం వద్ద కూడా ఇదే పరిస్థితి కనపడుతోంది.

పాక్‌కు నిధులు నిలిపేయాలని ఏడీబీకి విజ్ఞప్తి

పాకిస్థాన్‌పై ఆర్థిక దాడులే లక్ష్యంగా భారత్ పావులు కదుపుతోంది. పాకిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థలకు అందుతున్న నిధులను అడ్డుకునేందుకు భారత్ చర్యలు చేపట్టింది. ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) అధ్యక్షుడిని కలుసుకున్న కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ పాక్‌కు నిధులు నిలిపివేయాలని డిమాండు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పాక్‌కు అందుతున్న ఏడీబీ రుణాలను నిలిపివేయాలని కోరింది. ఇటలీలోని మిలాన్‌లో ఏడీబీ వార్షిక సమావేశంలో ఆ బ్యాంకు అధ్యక్షుడు మసాటో కాండాతో సమావేశమైన నిర్మలా సీతారామన్ ఇటలీ ఆర్థిక మంత్రి జియాన్ కార్లో గియోర్‌గెట్టి వద్ద కూడా ఇదే డిమాండ్ తెచ్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి.

ఉగ్రవాద స్థావరం గుట్టు రట్టు

బకెట్లలో ఐఈడీల స్వాధీనం

శ్రీనగర్: జమ్ము కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లా, సురాన్‌కోట్‌లో ఉగ్రవాద స్థావరాన్ని భద్రతా దళాలు, పోలీసులు గుర్తించారు. పహల్గాం ఉగ్రవాదుల కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు జరుపుతుండగా, ఉగ్రవాద స్థావరం బయటపడింది. టిఫిన్ బాక్సుల్లో మూడు, స్టీల్ బకెట్లలో రెండు ఐఈడీలను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు.

అడవుల్లో మాటు వేయటంపై

ఉగ్రవాదులకు శిక్షణ

న్యూఢిల్లీ, మే 5: పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ముష్కరులు అడవులు, పర్వతాల్లో స్థావరాలు నిర్మించుకొని మాటు వేయటంలో నిపుణులని తేలింది. జమ్ము కశ్మీర్ జైళ్లలోని టెర్రరిస్టుల ఇంటరాగేషన్‌లో ఈ కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పర్వత ప్రాంతాల్లో రహస్య స్థావరాల నిర్మాణంలో ఉగ్రవాదులకు పాక్ ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్టు దర్యాప్తులో తేలింది. రోజుల తరబడి అడవుల్లో దాక్కొని జీవించడం ఎలానో కూడా వీరికి నేర్పించారని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి అడవుల్లో బయటపడ్డ ఉగ్రస్థావరాల్ని భద్రతా బలగాలు గుర్తించాయి. బైసరన్ లోయ చుట్టూ ఉన్న మార్గాలను పూర్తిగా జల్లెడ పడుతున్నాయి. ఈ లోయ నుంచి మొదలయ్యే 54 మార్గాలను గుర్తించి తనిఖీలు చేపట్టాయి. ఉగ్రవాదులకు లాజిస్టిక్స్(సామాగ్రి) సాయం చేసిన కొందరు ఓవర్ గ్రౌండ్ వర్కర్లను అదుపులోకి తీసుకున్న భద్రతా దళాలు..వారిని వెంటబెట్టుకొని ఈ మార్గాలను గాలిస్తున్నాయి.

మోదీతో రక్షణ శాఖ కార్యదర్శి భేటీ

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకున్నారు. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఆదివారం ప్రధాని మోదీతో సమావేశమై భద్రతా పరిస్థితిని చర్చించినట్లు తెలిసింది. మరుసటి రోజే రక్షణ కార్యదర్శి ప్రధానితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మరో క్షిపణిని పరీక్షించిన పాక్

ఇస్లామాబాద్, మే 5: తమ సైనిక విన్యాసం ఎక్సర్‌సైజ్ ఇండస్‌లో భాగంగా పాకిస్థాన్ సోమవారం మరో క్షిపణి ప్రయోగ పరీక్షను విజయవంతంగా నిర్వహించినట్టు ఆ దేశ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ఒక ప్రకటనలో తెలిపింది. కార్యాచరణ సంసిద్ధతను, క్షిపణి అధునాతన నావిగేషన్ వ్యవస్థ, మెరుగైన కచ్చితత్వంతో పాటు సహా పలు కీలక సాంకేతిక సామర్థ్యాలను ధ్రువీకరించడానికి 120 కి.మీ రేంజ్ గల ఈ క్షిపణి ప్రయోగ పరీక్ష నిర్వహించినట్టు తెలిపింది. మరోవైపు 11వ రోజు కూడా పాక్ సరిహద్దులో కవ్వింపు కాల్పులకు పాల్పడింది. అయితే భారత సైన్యం కాల్పులను సమర్థంగా ఎదుర్కొంది. ఇంకోవైపు భారత్‌తో ఉద్రిక్తతల వేళ పాకిస్థాన్ ప్రభుత్వం అఖిల పక్ష భేటీ నిర్వహించింది. దీనికి ప్రధాన విపక్షమైన ఇమ్రాన్ ఖాన్ పార్టీ గైర్హాజరైంది.

భారత్‌పై పాకిస్థానీ హ్యాకర్ల దాడులు

పలు డిఫెన్స్ వెబ్‌సైట్లు హ్యాక్

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న తరుణంలో పాకిస్థానీ హ్యాకర్లు సోమవారం పలు ఇండియన్ డిఫెన్స్ వెబ్‌సైట్లపై సైబర్ దాడులు చేశారు. డిఫెన్స్ సిబ్బంది లాగిన్ క్రెడెన్షియల్స్ సహా సున్నితమైన సమాచారం హ్యాక్ అయినట్లు తెలిసింది. పాకిస్థాన్ సైబర్ ఫోర్స్ ఇచ్చిన ఎక్స్ పోస్ట్‌లో భారత మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్, మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్‌ల సున్నిత సమాచారాన్ని హ్యాకర్లు పొందినట్లు తెలిపింది. ఈ గ్రూప్ ఆర్మర్డ్ వెహికిల్ నిగమ్ లిమిటెడ్ వెబ్‌సైట్ రూపురేఖలను మార్చేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. పాకిస్థాన్ సైబర్ ఫోర్స్ ఎక్స్ హ్యాండిల్‌ను మన దేశంలో ప్రభుత్వం నిలిపేసింది.

ఉజ్జయిని మహంకాళీ గుడిలో అగ్ని ప్రమాదం

భోపాల్: ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఉజ్జయిని మహంకాళీ ఆలయ ఆవరణలో సోమవారం మంటలు చెలరేగాయి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ కంట్రోల్ రూమ్‌పై ఏర్పాటు చేసిన గాలి నాణ్యత నిర్వహణ వ్యవస్థలో ఒక్కసారిగా మంటలు మొదలయ్యాయని, ఓ బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌కు గురవ్వటం వల్లే ఇది జరిగి ఉండొచ్చని జిల్లా అధికారులు చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది మంటల్ని వెంటనే అదుపులోకి తీసుకొచ్చారని, ఈ ఘటనలో ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

కశ్మీర్ జైళ్లకు ఉగ్ర దాడి ముప్పు!

నిఘా సంస్థల హెచ్చరిక

శ్రీనగర్: జమ్ము కశ్మీరులోని జైళ్లకు ఉగ్రవాద దాడి ముప్పు పొంచి ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో అప్రమత్తమైన అధికారులు జైళ్ల వద్ద భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేశారు. శ్రీనగర్‌లోని సెంట్రల్ జైలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు తదితర హై సెక్యూరిటీ జైళ్లపై ఉగ్రవాదులు దాడి చేసే ప్రమాదం ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు జారీ అయ్యాయి. ఈ జైళ్లలో ప్రస్తుతం పేరు మోసిన ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలకు చెందిన స్లీపర్ సెల్స్ బందీలుగా ఉన్నారు. స్లీపర్ సెల్స్ ఉగ్రవాదులకు అవసరమైన రవాణా, ఆశ్రయం వంటివి కల్పిస్తారు.

పహల్గాం ఉగ్రవాదులకు స్థానికుల సహకారం?

శ్రీనగర్: స్థానిక స్లీపర్ సెల్స్ సహకారం లేకుండా పహల్గాం ఉగ్రదాడి జరిగి ఉండదని మాజీ స్లీపర్ సెల్ సభ్యుడు తెలిపాడు. సోమవారం ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను మాట్లాడుతూ, దాడి చేయాల్సిన చోట ఎందరు సైనికులు ఉన్నారో ఉగ్రవాదులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించాడు. ఈ సమాచారాన్ని స్లీపర్ సెల్ ఆపరేటివ్స్ ముందుగా ఉగ్రవాదులకు ఇస్తారని చెప్పాడు. కశ్మీరుకు చెందిన ఈ స్లీపర్ సెల్ మాజీ సభ్యుడు రెండేళ్లు జైలు జీవితం గడిపాడు.

7న దేశమంతా సెక్యూరిటీ మాక్ డ్రిల్స్

మొదటిపేజీ తరువాయి...

విద్యుత్తు దీపాలను ఆర్పివేశారు. సెక్యూరిటీ మాక్ డ్రిల్స్‌లో భాగంగా పంజాబ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ(పీఎస్‌పీసీఎల్)ని అరగంట పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. యుద్ధ సమయాలలో విద్యుత్ దీపాలను ఆర్పి ఆ ప్రాంతాన్ని అంధకారంలో ఉంచే విధంగా చేపట్టే చర్యల సన్నద్ధత కోసం ఈ రిహార్సల్ చేపట్టినట్లు ఓ అధికారి వివరించారు.

54 ఏండ్ల తర్వాత

దేశంలో సెక్యూరిటీ మాక్‌డ్రిల్స్ నిర్వహణ కొత్తదేమీ కాదు. అదే సంవత్సరం 1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసమని భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగింది. ఆ సమయంలో పౌరుల భద్రత కోసమని అప్పటి ప్రభుత్వం యుద్ధానికి ముందు సెక్యూరిటీ మాక్ డ్రిల్స్‌ను నిర్వహించింది. ఇప్పుడు 54 ఏండ్ల తర్వాత మళ్లీ ప్రభుత్వం మాక్‌డ్రిల్స్ నిర్వహిస్తున్నది.

మాక్ డ్రిల్ అంటే...

మాక్‌డ్రిల్ అనేది ఒక రక్షణకు సంబంధించిన శిక్షణ ప్రక్రియ. ఇది వ్యవస్థ లేదా సంస్థ పనిచేస్తున్నదా లేదా అని పరీక్షించి, భవిష్యత్తులో ప్రాణనష్టం జరగకుండా ముందస్తుగా ప్రతిస్పందించడానికి అనుసరించే మార్గం. నిజంగా ప్రమాదం జరగకుండానే ప్రమాదానికి ఎలా ప్రతిస్పందించాలో ప్రాక్టీస్ చేయడంగా దీనిని పేర్కొనవచ్చు. ప్రజలలో అప్రమత్తత పెంపొందించడం, సిబ్బందిలో తక్షణ స్పందన, నైపుణ్యాన్ని మెరుగుపర్చడం, సాంకేతిక లోపాలను ముందుగా గుర్తించడం, ఎమర్జెన్సీ ప్రతిస్పందన బృందాల సరైన సమన్వయాన్ని పరీక్షించడం ఈ మాక్ డ్రిల్‌ల లక్ష్యం. ఉదాహరణకు బహుళ అంతస్తుల భవనాలు, దవాఖానల్లో అగ్నిప్రమాదం, భూకంపం, ఉగ్రదాడి, వరదలు, తుఫాన్లు, రసాయన పొల్యూషన్ లాంటివి సంభవిస్తే ప్రతిస్పందించే విధానాన్ని ప్రదర్శిస్తారు. ఈ మాక్‌డ్రిల్‌లో ఆయా వ్యక్తులు, సంస్థలకు ముందుగా తెలిపి కానీ, తెలపకుండా హఠాత్తుగా గానీ నిర్వహిస్తారు.

కొన్ని దశలవారీగా మాక్‌డ్రిల్స్ ఇలా..

పన్నాగం, సిద్ధత (ప్లానింగ్, ప్రిపరేషన్): ఏ సమయంలో డ్రిల్ చేయాలి, ఎవరెవరు పాల్గొనాలి, ఏ పరిస్థితిని అనుసరించాలి అన్న అంశాలను అధికారులు ముందుగా నిర్ణయిస్తారు. అగ్నిమాపక, వైద్య, పోలీస్, శాఖలు ఇందులో పాల్గొంటాయి.

అలారం లేదా హెచ్చరిక ఇచ్చే దశ: భవనం లేదా ప్రమాద ప్రదేశంలో ప్రమాదం జరిగిందని అలారం మోగిస్తారు లేదా హెచ్చరిక ప్రకటన జారీ చేస్తారు. వైమానిక దాడుల ముందు కూడా ఇలాంటి అలారాలు మోగిస్తారు. అప్పుడు పౌరులు వెంటనే సురక్షిత ప్రాంతాల్లో దాక్కోవాలి.

తరలింపు దశ: ప్రమాదంలో చిక్కుకున్న వారిని భవనం నుంచి బయటకు తరలిస్తారు. అప్పుడు తొక్కిసలాట, గందరగోళం జరగకుండా నియమిత విధానంలో బయటకు వెళ్లేలా చేస్తారు. వారు సురక్షిత ప్రాంతానికి వెళ్లాక హాజరు కొడతారు.

అత్యవసర ప్రతిస్పందన: అత్యవసర పరిస్థితి ఏర్పడిన వెంటనే అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు, బృందాలు ఘటనా స్థలికి చేరుకుంటాయి. లోపల ప్రమాదంలో చిక్కుకున్న లేదా బందీలైన వ్యక్తులను బయటకు తీసుకురాగలుగుతామా అని పరీక్షిస్తారు. ఉగ్రదాడి అయితే ఉగ్రవాదులను కట్టడి చేసే అవకాశాలను, ప్రక్రియను ఆచరిస్తారు. అలాగే ఆపరేషన్ అయిన తర్వాత ప్రతిస్పందన సమయం నమోదు చేస్తారు. అన్ని శాఖలు, విభాగాలపై సమీక్ష జరిపి ఏ విభాగంలో లోపాలున్నాయి, ఎందులో మెరుగుదల అవసరం వంటి అంశాలను సమీక్షిస్తారు.

యుద్ధం వరకు వెళ్లొద్దు

భారత్, పాక్‌కు ఐరాస పిలుపు

ఐక్యరాజ్యసమితి: మే 5: ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరగడం పట్ల ఐక్య రాజ్య సమితి(యూఎన్) సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో సంయమనం పాటించాలని, యుద్ధానికి దూరంగా ఉండాలని ఆయన భారత్, పాక్‌కు పిలుపునిచ్చారు. తప్పు చేయవద్దని, సైనిక పరిష్కారం పరిష్కారమే కాదని సోమవారం ఓ ప్రకటనలో ఆయన హితవు చెప్పారు. ఉగ్రదాడి తర్వాత ఏర్పడిన చేదు భావాలను తాను అర్థం చేసుకోగలనని ఆయన తెలిపారు. ఉగ్రదాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన పునరుద్ఘాటించారు. పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని, ఇందుకు బాధ్యులైన వారిని చట్టపరంగా శిక్షపడేలా చూడాలని స్పష్టం చేశారు. శాంతి కోసం తన కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఇరుదేశాల ప్రభుత్వాలకు తెలియచేశారు. ఉద్రిక్తతలు తగ్గించి, దౌత్యపరమైన సంబంధాల మెరుగుదలకు, శాంతి స్థాపనను ప్రోత్సహించే ఎటువంటి చర్యలకైనా తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

హిందువులను కెనడా నుంచి పంపేయండి

ఖలిస్థానీల విష ప్రచారం

ఒట్టావా, మే 5: కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు రోజురోజుకీ మితిమీరిపోతున్నాయి. తాజాగా హిందువులను దేశం నుంచి వెనక్కి పంపాలంటూ వారు విష ప్రచారం మొదలు పెట్టారు. కెనడాలోని 8 లక్షల మంది హిందువులను దేశం నుంచి వెళ్లగొట్టాలంటూ వేర్పాటువాదులు టొరొంటోలోని మాల్టన్ గురుద్వారాలో ఓ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భారత ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్ బొమ్మలను అభ్యంతరకర రీతిలో ఓ బోనులో పెట్టి ప్రదర్శించారు. ఇటీవల ఖలిస్థ